# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!





### ❖ ఢిల్లీ పెద్దల 'చేతి'లో తోలు బొమ్మలు..

దిలావర్‌పూర్, నవవబర్ 26 : సీఎం కేసీఆర్ సార్ ఇస్తున్న నిరంతర ఉచిత విద్యుత్‌తో మంచిగా పంటలు పండిస్తూ ఆర్థికంగా బలోపేతం అయ్యాం. రంది లేకుండా బతుకుతున్నం. ఎవుసంతో ప్రతి రైతు ఇల్లు పండుగలా మారింది. ధాన్యంతో కళకళలాడుతోంది. గిప్పుడేమో కాంగ్రెసోళ్లు వ్యవసాయానికి మూడు గంటల కరెంటిస్తామని అంటున్నరు. 24 గంటల కరెంటు మంచిగున్నదంటే మూడు గంటలెట్ల ఇస్తఅంటరు. వారికేమైనా ఎవుసంపై అవగాహన ఉంటే మాట్లాడుతున్నరా. ఢిల్లీ పెద్దలు ఎలా చెబితే అలా తలుపుతున్నరు. రేపు కూడా వాళ్లు చెప్పినట్టే వినాల్సి వస్తది. ఇక్కడి ప్రజల, రైతుల అవసరాలను పట్టించుకునే పరిస్థితి ఉండదు. అందుకే మేము కాంగ్రెస్‌కు అవకాశం ఇవ్వం.

**- సాయన్న, రైతు, న్యూ లోలం, దిలావర్‌పూర్ మండలం**



### ❖ సీఎం కేసీఆర్‌కే మా మద్దతు..

మామడ, నవంబర్ 26 : తెలంగాణ ప్రభుత్వం రైతులకు 24గంటల ఉచిత విద్యుత్ ఇవ్వడం వల్ల పంటలకు సాగునీరు సమృద్ధిగా అందుతున్నది. బీఆర్‌ఎస్ సర్కారు వచ్చాకే రెండు పంటలు పండించుకుంటున్నాం. రైతులకు మేలు చేస్తున్న సీఎం కేసీఆర్‌కే మా మద్దతు. గత ప్రభుత్వాల హయాంలో రైతులు కరెంట్ లేక, మద్దతు ధర లేక అప్పుల పాలై ఆత్మహత్యలు చేసుకున్న ఘటనలు అనేకం ఉన్నాయి. కాంగ్రెస్ మళ్లీ వస్తే మళ్లీ అలాంటి కష్టాలు వచ్చే అవకాశం ఉంది. దీనిపై రైతులందరూ ఆలోచించాలి. బీఆర్‌ఎస్‌కే ఓటు వేయాలి.

**- ఎర్రోళ్ల రాజేశ్వర్, రైతు (పొన్కల్)**



### ❖ మోటర్‌కు లక్ష రూపాలు కావాలి..

దిలావర్‌పూర్, నవంబర్ 26 : ఎవుసంలో ఎన్ని పైసలు మిగులుతయో మాకే తెలుస్తది. గీ కాంగ్రెసోళ్లు రైతులకు 3 గంటల కరెంటిచ్చి, 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలంటున్నరు. 10 హెచ్‌పీ మోటర్ కొనాలంటే రూ.ఒక లక్ష కావాలి. ఆ పైసలు కాంగ్రెస్ పార్టీ వాళ్లు ఇస్తర. నేను బోరుబావి ఆధారంగా వరి సాగు చేస్తా. మూడు గంటల కరెంటుతో మూడు మడులు కూడా తడువవు. సమైఖ్య రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పటి రోజులు ఇప్పుడిప్పుడే మరిచి పోతున్నాం. ఎలక్షన్లు వచ్చినయని కాంగ్రెసోళ్లు అమలుకాని హామీలిస్తూ ప్రజలను మోసం చేయాలని చూస్తున్నరు. కాంగ్రెస్‌కు అవకాశం ఇస్తే కాట్లే కలిసిపోవుడే. వాళ్లు అధికారంలోకి వచ్చేదున్నద. సచ్చేదున్నద.

**- సప్పల రవి, దిలావర్‌పూర్**

## ఎవుసం తెల్వనోడు ఏదేదో మాట్లడుతడు..

■ కాంగ్రెసోళ్ల ది రైతులను ఆగం జేసే కుట్ర.. ■ వారితీరుపై అన్నదాతల ఆగ్రహం..


**'24 గంటల కరెంటుతోటి మంచిగా రెండు పంటలు పండించుకుంటా హాయిగా ఉన్నాం. కాంగ్రెసోళ్లు అధికారంలో ఉన్నప్పుడు పడ్డ కష్టాలు చాలు. మళ్లీ ఇప్పుడు ఎలక్షన్లు రాంగనే కాంగ్రెసోళ్లు ఏదేదో మాట్లాడుతున్నారు. రేవంత్‌రెడ్డికి పిచ్చిపట్టినట్టుంది. మూడు గంటల కరెంటు సరిపోతదని అంటున్నాడు. మూడు గంటల కరెంటు తోటి తడిసిన మడే తడుస్తుంది. 10హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలంటడు. గీ మోటర్లు పెట్టుడంటే ఉట్టిగనే అయితదా? లక్ష రూపాయలు దాకా కావాలె. అయినా 10హెచ్‌పీ మోటరు పెడితే ఒక్క దెబ్బ కు నీళ్ల ను గుంజేత్తది. మోటర్లన్నీ ఒక్కటే సరి నడిసేసరికి ఉన్నయన్నీ కాలిపోతయ్. ఎవుసం గురించి ఏం తెల్వనోళ్లు కూడా నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నరు. ఎవరికి ఎలా బుద్ధి చెప్పాలో మాకు బాగా తెలుసు..' అని రైతులు స్పష్టం చేస్తున్నారు.**

### ❖ ఎవుసం ఎట్లజేస్తం..



దిలావర్‌పూర్, నవంబర్ 26 :నాకు పదెకరాల వ్యవసాయ భూమి ఉన్నది. గొట్టపు బావులపై ఆధారపడి వ్యవసాయం చేస్తా. కేసీఆర్ దయతో 24 గంటల ఉచిత కరెంట్ ఇవ్వడంతో ఆర్థికంగా ఎదుగుతున్నా. 50 ఏండ్లు పాలించిన కాంగ్రెస్ పార్టీ మాకు ఏం చేయలేకపోయింది. కాంగ్రెసోళ్లు ఇచ్చే 3 గంటల కరెంట్‌తో మూడెకరాలు కూడా పారవు. ఎవుసం ఎట్ల జేస్తరు. నేను ప్రస్తుతం 5 హెచ్‌పీ మోటర్లు వాడుతున్న. వాటిని తీసేసి 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకోమని కాంగ్రెస్ పార్టీ నాయకులు చెబుతున్నరు. వేటు పడి ట్రాన్స్‌పార్మర్స్ పేలిపోతాయి. సబ్‌స్టేషన్స్ కాలి పోతాయి. రైతుల బతుకులు అగం అవుతాయి. మళ్లీ ధర్నాలు, రాస్తారోకోలు చేయాల్సి వస్తది. మా రైతుల జోలికొస్తే కాంగ్రెస్ పార్టీని బంగాళాఖాతంలో వేస్తం.

**- రాజారెడ్డి, రైతు, గుండంపల్లి,**



### ❖ మూడు గుంటలు పారది..



దిలావర్‌పూర్, నవంబర్ 26 : ఎవుసానికి మూడు గంటల కరెంట్ ఇస్తే సరిపోతుందని, 24 గంటల కరెంట్ ఇచ్చి కేసీఆర్ వృథా చేస్తున్నడని కాంగ్రెస్ నాయకులు చెప్తుంటే కన్నీళ్లస్తున్నయ్. 3 గంటల కరెంట్ ఇస్తే 3 గుంటల పారుకం పారదు. ఎట్ల సరిపోతుందో ఆ పార్టీ నాయకులే చేసి చూపించాలి. కేసీఆర్ ప్రభుత్వం వచ్చిన తర్వాత రైతుల ముఖాల్లో ఆనందం కనిపిస్తున్నది. రైతులు ఆనందంగా ఉండుడు కాంగ్రెసోళ్లకు నచ్చుతలేదు. వారి పాలన కాలంలో ఎప్పుడూ రైతు ఆత్మహత్యలు, కరెంట్ కష్టాలుండేవి. కాంగ్రెస్ పార్టీ వద్దు.. రైతుబంధు సాయం ఇచ్చే నాయకుడే కావాలి. **- ముజ్జీ ముత్తన్న, న్యూ లోలం**

### ❖ ఎవుసాన్ని ఆగం జెయ్యాల్ననే..



దిలావర్‌పూర్, నవంబర్ 26 : 10 హెచ్‌పీ మోటర్లు పెట్టి, ఎవుసం చేయిస్తే భూమిల నీళ్లన్నీ ఎండిపోతయ్. ఒకేసారి రైతులంతా మోటర్లు పెడితే అన్నీ కాలిపోతయ్. ట్రాన్స్‌ఫార్మర్లు పేలిపోతయ్. ఆ కాలిపోయిన మోటర్లను పట్టుకొని మెకానిక్ దుఖానం చుట్టూ తిరుక్కుంటా ఉన్న పొలం ఎండి పోయి సచ్చిపోయో రోజులు వస్తయ్. గింత గూడా తెల్వది గా కాంగ్రోసోళ్లకు. అన్ని విధాలుగా రైతులకు మంచి చేస్తున్న కేసీఆర్ ప్రభుత్వానికే మా ఇంటి ఓట్లు. కేసీఆర్ ప్రభుత్వం వచ్చిన తర్వాత 24 గంటల కరెంట్‌తో మా భూములు మంచిగ సాగు చేసుకుంటున్నాం. మా కుటుంబాలు బాగుపడుతుండడంతో పాటు కూలీలకు ఉపాధి దొరుకుతున్నది. **- గోవిందుల మధు, న్యూ లోలం**

### ❖ అవగాహన లేని మాటలు..



సారంగాపూర్, నవంబర్ 26 : రైతులకు మూడు గంటల కరెంట్ సరిపోతదని కాంగ్రెస్ నాయకులు అంటున్నరు. వ్యవసాయ, విద్యుత్ రంగాల మీద వాళ్లకు అవగాహన లేదనేందుకే ఇదే నిదర్శనం. మూడు గంటల విద్యుత్ వల్ల ఒక్క మడి కూడా తడ్వది. 10 హెచ్‌పీ మోటర్లను రైతులు భరించలేరు. అందరూ ఒకేసారి ఆన్ చేస్తే పరిస్థితి ఏంది. అధిక లోడ్‌తో ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతయ్. 24 గంటల కరెంట్‌తో రైతులు ఇష్టం వచ్చినప్పుడు పోయి మోటర్లు ఆన్ జేసేకుంటరు. రైతుకు అన్ని విధాలా అనుకూలంగా ఉంటుంది. **- చిన్నొల్ల నర్సయ్య, రైతు, జామ్**

### ❖ పంటలు ఎండిపోతయ్..

దిలావర్‌పూర్, నవంబర్ 26 : మూడు గంటల కరెంటిస్తామంటున్న గీ కాంగ్రెస్ పార్టీ మాకొద్దు. 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ ఇస్తున్న సీఎం కేసీఆర్ పాలనే కావాలి. మేం మంచిగ వ్యవసాయం చేసుకొని బతుకుతుంటే మా జీవితాల్లో చిచ్చుపెట్టేందుకు కాంగ్రెస్ నాయకులు కుట్రలు చేస్తున్నరు. 5 హెచ్‌పీ మోటరు పెడితేనే పంటలకు సక్రమంగా నీరు పారదు. అటువంటిది 10 హెచ్‌పీ మోటరు పెడితే పంటలు ఎండి పోవడం ఖాయం. ఒకేసారి 10 హెచ్‌పీ మోటర్లు పెడితే ట్రాన్స్‌పార్మర్లు పేలిపోతయ్. అప్పుడు సాగు చేసేందుకు కరెంట్ లేక, ఇంట్లో ఉన్న పిల్లలకు చదువుకొనేందుకు కరెంట్ లేక అవస్థలు పడాల్సి వస్తది. మళ్లా మా బతుకులు ఆగమైతయ్. మళ్లా ఇబ్బందులు పడాల్సి వస్తది. ఆ పరిస్థితి మాకు అసలే వద్దు.

**- జాదవ్ కవితాబాయి, కాల్వతండా, దిలావర్‌పూర్**